
# డాలర్ వర్సస్ మదర్



"ప్రియమైన నా బిడ్డలారా!

"ప్రేమతో మిమ్మల్ని మనసారా పిలిచే ఆరోగ్యస్థితిలో లేను. అయినా ఉత్సాహాన్ని కొని తెచ్చుకొని, ధైర్యాన్ని పుంజుకొని, బీడుపోయిన పాడు శరీరంతో ఓపిక తెచ్చుకొని రాస్తున్నా నీ ఉత్తరాన్ని. మమకారం చంపుకోలేక మీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చివరి ప్రయత్నంగా మిమ్మల్ని వాత్సల్యంతో హెచ్చరిస్తూ నేను చేస్తోన్న ఆఖరి యత్నమిది.

"ఇంకా ఎంతో కాలం బతకలేను. నా 'పచ్చని' బతుకు చెదిరిపోయింది. శరీరం శుష్కించిపోయింది. నిగనిగలాడే నా చర్మం నెర్రెలు బారింది. ధమనుల్లో ప్రవహించే రక్తం కలుషితమైంది. గుండె లయ తప్పి వింత శబ్దాల్ని చేస్తున్నది. ఊపిరితిత్తులు కుంచించుకు పోయి కొత్త వాయు ఘటకాల్ని శ్వాస పీల్చుకోడానికి ఆయాసపడుతున్నాయి. ఒళ్లు వేడెక్కి మంచు కరుగుతోంది. కొండలు పిండి అయిపోతున్నాయి. ఎడారులు చాపకింది నీరులా మెల్లగా విస్తరిస్తున్నాయి. 'జీవం' లేని సముద్రాలు మట్టం పెంచుకొని కట్టలు తెంచుకుంటున్నా హోరు మీకు వినిపించడంలేదు. జీవరాశిని రక్షించే ఓజోన్ ఛత్రంలో రంధ్రాలు పెద్ద వవుతున్నాయి. కాకులు దూరని కారడవుల్లో దూరారు మీరు. గ్రహాల్ని చుట్టి వస్తున్నారు. జీవుల మధ్య ఏళ్ల తరబడి చెక్కుచెదరకుండా ఉన్న పరస్పర సంబంధాల్ని తుడిచేస్తున్నారు.

"అతి విలువైన ఆలోచనా శక్తి ఉన్న మీరు మిగతా జీవరాశిని అంతరించే దిశలవైపు లాక్కెళ్లుతున్నారు. ఈ పాటికే ఎన్నో జీవుల్ని బొమ్మల్లో-రాతల్లో చూసుకుంటున్నారు. వీటన్నింటికి మూల కారణం మీరే! ఈ విషయం మీకు స్పష్టంగా తెలుసు. అయినా నన్ను రక్షించుకునే తాపత్రయం కనబడడంలేదు. ఇంత స్తబ్దత ఎలా అలవర్చుకున్నార్రా! చివరకు తల్లి క్షీరం కూడా తన మహత్తర శక్తిని కోల్పోయింది.

"ఇరవై సంవత్సరాల క్రితం [1972] నన్ను రక్షించుకోడానికి స్టాక్‌హోమ్‌లో పెద్ద సమావేశం జరుపుకున్నారు. అప్పటికే ఆలస్యం చేసినా, కనీసం నా గురించి మేధావులంతా ఓ చోటికి చేరి చర్చలు జరిపారని సంతోషించాను. రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్లాయి. నా బతుకు మరింత దిగజారిపోయిందే తప్పు ఏ మాత్రమూ వెలుగులేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండిపోయింది. సాధించిందేమిటి? ప్రతి సంవత్సరం జూన్ అయిదున ప్రపంచ పర్యావరణ దినంగా వేడుకలు మాత్రం జరుపుతారు. రోగిష్టిగా ఉన్న తల్లికి తద్దినం పెట్టుకోవడం అలవాటు చేసుకుంటున్నార్రా!

"మీ కుంచిత స్వభావం, స్వార్థపూరిత ఆలోచనలు, విలాసాలకు అలవాటుపడ్డ జీవితాలు, నిజాయితీలు లేని రాజకీయాలు - అన్నీ కలిపి మీకు చిన్నచూపు ఆలోచనలను ప్రసాదించాయి. ఇవి నా దీర్ఘకాలపు ఆరోగ్యానికి దారితీశాయి. ఫలితం అనుభవిస్తున్నారు. తల్లి లేని పిల్లలు ఎంతకాలం నిలువగలరు?

"ఈ మధ్య పృథ్వీ సదస్సంటూ - ధరిత్రి శిఖరాగ్ర సమావేశ మంటూ పెద్ద హంగామా చేశారు. తల్లి చావు బతుకుల్లో ఉంటే ఈ సమావేశాలేమిటో! ఇంట్లో మీ పాపా, పిల్లలకేమైనా అయితే వెంటనే డాక్టరుకు పరుగెత్తుతారు. మంచి వైద్యం అందిస్తారు. అంతటి ఆతురత ఈ తల్లి పట్ల ఎందుకు గోచరించదో? ఒక హృదయమున్న మనిషి బాధాకరమయిన సంఘటనల పట్ల చూపే సంవేదనాశీలతను తల్లి పట్ల వ్యక్తపరచలేని పశుత్వ స్థితికి చేరుకున్నారు. పేగు తెగి మీ రొక్కక్కరూ మీ మీ తల్లుల నుండి భౌతికంగా విడిపోయారు. నేను మీ అందరి తల్లిని. పృథ్వీ మాతను. కంటికి కనబడని పేగు బంధం మనల్నందరినీ ఎన్నో విధాలుగా కలిపి ఉంచింది. ఎన్నటికీ తెగని బంధాలివి. మీ రంతా మీ జాతికే గోరీ కట్టుకుంటున్నారు. ముందు తరాల వారి జీవితాన్ని మొగ్గలో తుంచే హక్కు మీకు లేదు. శుభ్రమైన గాలిని, స్వచ్ఛమైన నీటిని వారూ పొందాలి.

"పృథ్వీ సదస్సు నుండి ఎంతో కొంత ఆశించాను. 'ఇంటెన్సివ్ కేర్ యూనిట్'లో అవస్థపడుతున్నాను. ఈ పరిస్థితి దృష్ట్యానైనా ఇక మీ సంప్రదింపులూ, సమావేశాలూ, కమిటీలు, 'సమ్మిట్'ల కిక అదే అంతమని అనుకున్నాను. కాని అక్కడ జరిగింది తెలిసి చలించిపోయాను. తల్లిని సంరక్షించుకునేందుకు జరిగిన తర్జనభర్జనలను చూస్తుంటే, వింటుంటే మతిపోతోంది నాకు. 'నార్త్' అంటూ, 'సౌత్' అంటూ విడిపోయారు. ఒకరు 'క్లోరోఫ్లోరోకార్బన్' అంటే మరొకరు 'మీథేన్' అంటారు. ఇలా మీ అభివృద్ధికి వ్యతిరేక ప్రతీకలైన వాటిని దువ్వుకుంటూ కుమ్ములాడుకున్నారు. మీ రంతా సంతానం. ఓ తల్లి కడుపులో నవమాసాలు మకాం చేసి ఈ పుడమి తల్లిపై పడ్డారు. మీ బరువును ఇంకా మోస్తూనే ఉన్నాను.... మోస్తూనే ఉంటాను... మిమ్మల్ని మీ భావితరాల్ని మరింత ప్రేమగా చూసుకోడానికైనా నన్ను కాపాడుకోండి.

"వసుధైక కుటుంబకం" అంటారు. ప్రపంచ మంతా ఒకే కుటుంబం అన్నప్పుడు ఈ తారతమ్యాలెందుకో? ప్రాంతీయ విభేదాలెందుకో? తల్లిని ముక్కలు చేసి చర్చించడం మీకు సిగ్గనిపించకపోయినా నాకు మీ రంతా ఒక్కటే! తల్లయితే కాని అర్థంకాదు ఈ అనుభవం, ఈ వేదన! రోజుల కొద్దీ చర్చలయినా అంతు తేలనట్లుంది. ప్రపంచంలోని ప్రతి మూల నుండి తరలి వచ్చిన అగ్రనాయకులు తల్లి పట్ల ఉన్న మీ బాధ్యతలకు ప్రాత్యేకత చేకూర్చి మీ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తా రనుకున్నాను. చుక్కల గీతలపై సంతకాలు పెట్టడానికి చేతులు ముడుచుకున్నారు. రాజకీయాలు రాజుకున్నాయి. "ఎజెండా - 21" [నాలుగు విభాగాలు - నలభై అధ్యాయాలు - నాలుగు వందలకు పైగా పేజీలు] రామాయణ, మహాభారతాలను గుర్తుకు తెస్తోంది. అందులోని రాతలకు రూపకల్పన జరిగే దెపుడు? ఆచరణలోకి రూపాంతరం చెందే దెపుడు? కొత్త జీవం పోసుకొని మిమ్మల్ని నా ఒడిలో చల్లగా చూసుకోడానికి ఉవ్విళ్లూరుతున్నాను. మీరు నన్ను పట్టించుకుంటే మిమ్మల్ని మరింత ప్రేమగా చూసుకొనే అవకాశం కలుగుతుంది. ఇది నా అత్యాశ కాదని నిరూపిస్తారా?

"నా చెల్లనే సరికి ముద్రించిన డాలర్లే మీకు ప్రియ మయ్యాయా? తల్లిని బ్రతికించుకోడానికి ముందుకు రారూ! సంపన్న దేశాల బిగిసిన పిడికిళ్లు తెరచుకోవూ! మీ తీరు, వ్యవహారాలు మార్చుకోరూ! మరణశయ్యపై నున్న నన్ను బ్రతికించుకోరూ! మోహినీ మోహంలో పడి చేతులు పైకెత్తిన భస్మాసురుని స్థితిలో ఉన్న మీరు చేతులు తలపై మోపుకొని భస్మీపటలం అవుతారో లేక ఆ చేతులనే కలపి, కలసిమెలసి నన్ను రక్షించుకుంటారో తేల్చుకొండి. మీ రంతా కలియుగ భస్మాసురులు కాకండి.

"నా భవిష్యత్తుతోనే మీ భవిష్యత్తు ముడిపడి ఉన్న
"మీ తల్లి...." భూమాత.

డా.టి.సంపత్‌కుమార్